సాక్షి
కామారెడ్డి
ఆదివారం । 7 । సెప్టెంబర్ । 2025



కొత్త పింఛన్ కోసం..
పింఛన్‌ల కోసం దివ్యాంగులు, వృద్ధులు, ఒంటరి మహిళలు, వితంతులు నాలుగేళ్లుగా ఎదురు చూస్తూనే ఉన్నారు.
- 8లో ▸



ఘనంగా అనంత చతుర్దశి..
జిల్లాలోనే ఏకైక అనంత పద్మనాభస్వామి (భిక్కనూర్)ఆలయంలో అనంత చతుర్దశి వేడుకలు ఘనంగా నిర్వహించారు.
- 8లో ▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
34.8 /22.0
ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. వాతావరణం పొడిగా ఉంటుంది. ఎండ ప్రభావం ఉంటుంది.

న్యూస్‌రీల్

కేసీఆర్ అవినీతి బయటపడుతుంది



నిజాంసాగర్(జుక్కల్): కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన అవినీతి సీబీఐ విచారణతో బయటపడుతుందని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అన్నారు. లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీముబారక్, సీఎం సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే మండల కేంద్రంలో శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్టును కేసీఆర్ కుటుంబం ఏటీఎంలా వాడుకుందని ఆరోపించారు. కేసీఆర్ అవినీతి బయటపడుతుందనే విచారణ వద్దంటూ బీఆర్‌ఎస్ నాయకులు ధర్నాలు చేస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాసంక్షేమానికి పెద్ద పీట వేస్తోందన్నారు.

కార్యక్రమంలో పిట్లం మార్కెట్ కమిటీ చైర్మన్ చీకోటి మనోజ్‌కుమార్, ఉమ్మడి మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు ఎలే మల్లికార్జున్, రవీందర్‌రెడ్డి, నాయకులు ప్రజాపండరి, ఇష్తేకర్ దొర, సాయిలు, బాల్‌సాయిలు తదితరులు పాల్గొన్నారు.

లింగంపేట వాసికి 'గణపతి' అవార్డు



లింగంపేట(ఎల్లారెడ్డి): పర్యావరణ పరిరక్షణ కోసం కృషి చేస్తున్న వారికి జ్ఞాన వికాస భారతి క్రీడా సాహితీ సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో అందించే గణపతి అవార్డు లింగంపేట మండల కేంద్రానికి చెందిన యువ యూత్ అధ్యక్షుడు బొల్లు శ్రీకాంత్‌కు దక్కింది. హైదరాబాద్‌లోని ఎల్బీనగర్ రాక్‌టవర్ కాలనీలో శనివారం అవార్డును అందజేయగా శ్రీకాంత్ అందుకున్నారు. శ్రీకాంత్ గత 15 సంవత్సరాలుగా ప్రతి ఏటా మట్టి గణపతులు తయారు చేసి ఇంటింటికి వెళ్లి వితరణ చేస్తున్నారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో తయారు చేసే రంగురంగుల గణపతులు వాడడం వల్ల పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందని గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్న శ్రీకాంత్‌కు అవార్డుకు ఎంపికయ్యారు. అవార్డును రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు కేవీఎస్ రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. సంస్థ బాధ్యులు గోవర్ధన్‌చారి, బ్రహ్మచారి తదితరులు పాల్గొన్నారు.



కనుల పండువగా సాగిన శోభాయాత్ర

- ఆకట్టుకున్న విభిన్న రూపాలు, భారీ విగ్రహాలు
- డప్పు చప్పుళ్లు, నాసిక్ డోల్‌తో మార్మోగిన జిల్లా కేంద్రం
- శోభాయాత్రను వీక్షించేందుకు తరలివచ్చిన జనం
- ముగిసిన నిమజ్జనోత్సవం



జిల్లా కేంద్రంలో వినాయకుల శోభాయాత్ర

గంగమ్మ ఒడికి గణపయ్య

కామారెడ్డి టౌన్ : నవరాత్రులు పూజలందుకున్న వినాయకుడు శనివారం గంగమ్మ ఒడికి చేరాడు. జిల్లా కేంద్రంతోపాటు ఆయా మండలాల్లో వినాయకుల విగ్రహాల నిమజ్జన శోభాయాత్రను కనుల పండువగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం రాత్రి ప్రారంభమైన శోభాయాత్ర శనివారం రాత్రి వరకు కొనసాగింది. సుమారు 400లకు పైగా విగ్రహాలతో శోభాయాత్రను ఘనంగా నిర్వహించారు. ఇందిరాచౌక్ వద్ద విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో గణనాథులకు ఘన స్వాగతం పలికి మండపాల నిర్వాహకులను సన్మానించారు. డప్పులు, నాసిక్‌డోల్, బ్యాండ్, డోల్ చప్పుల మధ్య యువకులు నృత్యాలతో శోభాయాత్ర సాగింది. జిల్లా కేంద్రంలో రెండు రోజులపాటు గణపతి బప్పా మోరియా.. నినాదాలతో మార్మోగింది.

శోభాయాత్ర సాగిందిలా..

ఇందిరా చౌక్ నుంచి స్టేషన్‌రోడ్, సుభాష్‌రోడ్, మాయాబజార్, జేపీఎన్ విగ్రహం, వీక్లీమార్కెట్ రోడ్, పాంచ్‌రస్తా, గోపాలస్వామిరోడ్, పెద్దబజార్, రైల్వేబ్రిడ్జి, నిజాంసాగర్ చౌరస్తా మీదుగా టేక్రియాల్ వరకు శోభాయాత్ర కొనసాగింది. టేక్రియాల్ చెరువు వద్ద వినాయకులను చెరువులో నిమజ్జనం చేసేందుకు నాలుగు భారీ క్రేన్‌లను, ఒక డోజర్‌ను వినియోగించారు.

మున్సిపల్, పోలీస్, రెవెన్యూ శాఖల ఆధ్వర్యంలో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. చెరువు వద్దకు ఎవరూ వెళ్లకుండా మున్సిపల్ కార్మికులే వినాయక విగ్రహాలను నిమజ్జనం చేశారు.

భారీ బందోబస్తు

పోలీస్ శాఖ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎస్పీ రాజేశ్‌చంద్ర, ఏఎస్పీ చైతన్యరెడ్డిల పర్యవేక్షణలో డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు, ఏఎస్సైలు, కానిస్టేబుళ్లు, ఎన్‌సీసీ కేడెట్లు బందోబస్తులో పాల్గొన్నారు. మున్సిపల్, రెవెన్యూ, అగ్నిమాపక అధికారులు, సిబ్బంది సైతం శోభాయాత్ర విజయవంతం కోసం కృషి చేశారు. ట్రాఫిక్ డైవర్షన్ అమలు చేశారు. త్వరత్వరగా వెళ్లాలని సూచించడంతో పోలీసులకు, గణేశ్ మండళ్ల నిర్వాహకులకు మధ్య అక్కడక్కడ వాగ్వాదం చోటు చేసుకుంది.







కామారెడ్డి పట్టణంలో నిమజ్జనానికి తరలుతున్న భారీ వినాయకులు



మద్నూర్‌లో రైతు గణపతి

ఆకట్టుకున్న గణనాథులు

పలు మండపాల్లో భారీ విగ్రహాలను ప్రతిష్ఠించారు. 20 ఫీట్లకుపైగా ఎత్తున్న విగ్రహాలను ఎక్కువ సంఖ్యలో ప్రతిష్ఠించారు. శోభాయాత్రలో ఈ భారీ విగ్రహాలు విద్యుత్, టెలిఫోన్, బ్రాడ్‌బ్యాండ్ ఇంటర్‌నెట్, డిష్ వైర్లకు తాకడంతో ఇబ్బందులు పడాల్సి వచ్చింది. అలాగే విభిన్న రూపాల్లో కూడా వినాయక విగ్రహాలు వీక్షకులను ఆకట్టుకున్నాయి. ఈ శోభాయాత్రను వీక్షించడానికి చుట్టు పక్కల జిల్లాలు, మండలాలు, గ్రామాల నుంచి భారీగా జనం తరలివచ్చారు. రోడ్లన్ని జనాలతో కిక్కిరిసిపోయాయి.

పని ఒత్తిడి తగ్గించండి

కామారెడ్డి అర్బన్: పనిఒత్తిడి కారణంగా గుండెపోటుతో శుక్రవారం అకాల మరణం చెందిన డోంగ్లి ఏఈవో బస్వరాజ్ భార్యకు వెంటనే కారుణ్య నియామకం కింద ప్రభుత్వ ఉద్యోగం, ఆర్థిక సహాయం ఇవ్వాలని టీఎన్జీవోల సంఘం జిల్లా అధ్యక్షుడు నరాల వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం కలెక్టరేట్, వ్యవసాయశాఖ ఉద్యోగులు బస్వరాజ్ మృతికి సంతాపంగా మౌనం పాటించారు. జిల్లా వ్యవసాయాధికారి, కలెక్టర్‌కు వినతి పత్రాలు అందజేశారు. జిల్లాలో రైతు వేదికలకు డాటా ఎంట్రీ ఆపరేటర్లు, అటెండర్లను నియమించాలని, పని ఒత్తిడిని తగ్గించాలని కోరారు. టీఎన్జీవోల సంఘం నాయకులు ముల్క నాగరాజు, దేవరాజు, చక్రధర్, శ్రావణ్‌కుమార్, ఏఈవోల సంఘం జిల్లా నాయకులు శ్రావణ్‌కుమార్, రాకేశ్, శ్రీనివాస్‌రెడ్డి, దయానంద్, బి.శ్రీనివాస్, ముఖీద్, రాజాగౌడ్, రవీందర్, భూపాల్ సంతోష్, రేణుక, శ్రీలక్ష్మి, మీనా జిల్లాలోని 104 క్లస్టర్ల ఏఈవోలు పాల్గొన్నారు.



జిల్లా వ్యవసాయాధికారికి వినతి పత్రం అందజేస్తున్న టీఎన్జీవోస్ నాయకులు, ఏఈవోలు

నష్టాన్ని అంచనా వేయండి

- ఈ నెల 12లోగా నివేదికలు సమర్పించాలి
- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆదేశం

కామారెడ్డి క్రైం: భారీ వర్షాల కారణంగా జిల్లాలో జరిగిన నష్టాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించి ఈ నెల 12వ తేదీలోగా నివేదికలు అందజేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. వివిధ శాఖల అధికారులతో శనివారం నిర్వహించిన టెలీ కాన్ఫరెన్స్‌లో పలు సూచనలు చేశారు. ఈ నెల 4న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటన సందర్భంగా కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో వరదల నియంత్రణకు శాశ్వత పరిష్కారాలను చూపాలని ఆదేశించారని తెలిపారు. భారీ వర్షాల కారణంగా భవిష్యత్‌లో ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ప్రణాళికాబద్ధంగా పనులు చేపట్టాలని ఆదేశించారని అన్నారు. శాశ్వత పరిష్కారం కోసం పట్టణాలు, గ్రామాలు, కాలనీల్లో విచారణ చేపట్టి ఆక్రమణలను తొలగించాలని సూచించారు. చేపట్టాల్సిన పనులకు మరోసారి క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రతిపాదనలు సమర్పించాలన్నారు.



టెలీకాన్ఫరెన్స్‌లో అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

డివిజన్ స్థాయిలో కమిటీలు

డివిజన్ స్థాయిలో సబ్ కలెక్టర్, ఆర్డీవోల నేతృత్వంలో పోలీస్, ఇరిగేషన్, మున్సిపల్, మండల స్థాయి అధికారులు, టౌన్ ప్లానింగ్ అధికారులతో కూడిన కమిటీలను వేస్తున్నామని కలెక్టర్ తెలిపారు. కమిటీ సభ్యులు ఆయా డివిజన్లలో పర్యటించి అధిక వర్షాల కారణంగా దెబ్బతిన్న ప్రాజెక్టులు, రహదారులు, పంట పొలాలు, గృహాలు, వరద బాధిత గ్రామాలు, కాలనీలను సందర్శిస్తారని తెలిపారు. అధిక వర్షాలు కురిసిన సమయంలో ముంపు, వనరులు దెబ్బతినడానికి కారణాలను తెలుసుకుంటారని పేర్కొన్నారు. భవిష్యత్‌లో అధిక వర్షాలు వచ్చినా కూడా తీవ్ర నష్టం సంభవించకుండా శాస్త్రీయ సలహాలు, సూచనలు అందించాలన్నారు. అదనంగా కల్వర్టులు, చెక్‌డ్యామ్‌లు నిర్మించడానికి ప్రతిపాదనలు పంపాలన్నారు. ఆక్రమణలను స్వాధీనం చేసుకోవడం, తొలగించడం, నివేదించడం చేయాలన్నారు. జిల్లా స్థాయి ఫ్లడ్ మేనేజ్‌మెంట్ కమిటీలో కలెక్టర్ ఆధ్వర్యంలో ఎస్పీ, అదనపు కలెక్టర్, నీటిపారుదల శాఖ సీఈ ఉంటారని తెలిపారు. ఇసుక మేటల కారణంగా దెబ్బతిన్న పంటల వివరాలను అందించాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా 1,600 ఇళ్లు దెబ్బతిన్నాయని, వాటిని పరిశీలించి అర్హత గలవారికి ఇందిరమ్మ ఇళ్ల మంజూరు కోసం నివేదించాలని సూచించారు. టెలీ కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ చందర్ నాయక్, బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి, కామారెడ్డి, ఎల్లారెడ్డి ఆర్డీవోలు వీణ, పార్థసింహారెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులు వీరే..

కామారెడ్డి టౌన్: జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేసినట్లు డీఈవో ఎస్.రాజు శనివారం తెలిపారు. జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన ఉపాధ్యాయులకు ఈనెల 8వ తేదీన కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ చేతుల మీదుగా అవార్డులు అందజేసి సన్మానిస్తామన్నారు. ఎస్‌దేవేందర్, వెంకటచారి, లాల్‌సింగ్, సుజాత, రమేశ్‌కుమార్‌గౌడ్, బి.రమేశ్, నర్సిరెడ్డి, రూప్‌సింగ్, సహేంద్రనాథ్, షకీల్, అబ్దుల్‌రజాక్, శై లజ, శ్రీనివాస్, సుష్మ, పద్మశ్రీనివాసులు, శ్రీనివా స్, రాఘవేందర్‌రావు, సురేశ్, ప్రవీణ, చిన్నస్వా మి, సుధీర్, నాగయ్య, రాజలింగం, జనార్దన్‌రావు, నరేశ్‌రెడ్డి, సాయిరెడ్డి, ప్రవీల, రఫత్ సుల్తానా, రి జ్వానా అఫ్రీన్, రాధిక, వాణి, భద్ర య్య, బాబురా వు, అసిమా మదాని, అహ్మద్ షేక్, జనార్దన్, నవీనకుమారి, వెంకట్‌రావు, సాయిబాబా, శ్రీవాణి, గౌతమి మొత్తం 41 మంది ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైనట్లు వివరించారు.

ఈ నెల 15న కాంగ్రెస్ సభ !

- బీసీ డిక్లరేషన్ ప్రకటించిన వేదికపైనే..
- జాతీయస్థాయి నాయకులు హాజరయ్యే అవకాశం
- నేడు ఉమ్మడి జిల్లా నేతలతో సన్నాహక సమావేశం

కామారెడ్డిలో బీసీ సంబరాలు

కామారెడ్డిలోని ఇందిరాగాంధీ స్టేడియం వేదిక నుంచి బీసీ డిక్లరేషన్ ప్రకటించిన కాంగ్రెస్.. ఇప్పుడు అదే వేదికపైనుంచి బీసీ సంబరాలు నిర్వహించాలని నిర్ణయించింది. 42 శాతం బీసీ రిజర్వేషన్ బిల్లుకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిన నేపథ్యంలో విజయోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు కాంగ్రెస్ సిద్ధమైంది. ఈనెల 15వ తేదీన బహిరంగ సభ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తోంది.

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : బీసీ డిక్లరేషన్ ప్రకటించిన కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఇందిరాగాంధీ స్టేడియంలోనే బీసీ రిజర్వేషన్ సంబరాలు నిర్వహించాలని కాంగ్రెస్ రాష్ట్ర నాయకత్వం నిర్ణయం తీసుకుంది. ఈ నెల 15న బీసీలతో బహిరంగ సభ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ఈ మేరకు హైదరాబాద్‌లోని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ ఇంట్లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్క చర్చించారు. ఉమ్మడి జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నేతలతో కామారెడ్డిలో ఆదివారం సన్నాహక సమావేశం ఏర్పాటు చేశారు. 15న నిర్వహించతలపెట్టిన సభపై చర్చించనున్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో 2023 నవంబర్ 10న కామారెడ్డిలోని ఇందిరాగాంధీ స్టేడియం వేదికగా బీసీ డిక్లరేషన్ సభ నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా రేవంత్‌రెడ్డి నామినేషన్ వేసిన అనంతరం ఇందిరాగాంధీ స్టేడియంలో ఏర్పాటు చేసిన సభకు ర్యాలీ నిర్వహించారు. అక్కడ నిర్వహించిన సభలో కర్నాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్యతోపాటు రేవంత్‌రెడ్డి, ప్రొఫెసర్ కోదండరాం, సీపీఐ నారాయణ తదితరులు పాల్గొన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లతోపాటు పలు హామీలతో బీసీ డిక్లరేషన్ ప్రకటించారు. రాష్ట్రంలో అధికారంలోకి రావడంతో బీసీ రిజర్వేషన్లను అమలు చేయడానికి ఇటీవల అసెంబ్లీలో తీర్మానం చేసి గవర్నర్‌కు పంపిన విషయం తెలిసిందే. రిజర్వేషన్లు అమలు చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామని కాంగ్రెస్ పేర్కొంటోంది. బీసీ రిజర్వేషన్ల అంశాన్ని తమకు అనుకూలంగా మలచుకునేందుకు ఈ నెల 15న కామారెడ్డిలో బహిరంగ సభ ద్వారా సంబరాలు జరుపుకునేందుకు ఆ పార్టీ ఏర్పాట్లు చేస్తోంది.



కామారెడ్డిలోని ఇందిరాగాంధీ స్టేడియం వేదికపైనుంచి బీసీ డిక్లరేషన్ ప్రకటిస్తున్న నాయకులు (ఫైల్)

రిజర్వేషన్ల అంశంతో బీసీలకు దగ్గరయ్యేలా..

బీసీ డిక్లరేషన్‌లో భాగంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసేందుకు తమ ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మాణించిన విషయాన్ని అనుకూలంగా మల్చుకుని బీసీ వర్గాల్లో బలాన్ని పెంచుకునేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోంది. బీసీ రిజర్వేషన్ల విషయంలో కేంద్రంపై ఒత్తిడి తీసుకురావడానికి కాంగ్రెస్ పార్టీ ఢిల్లీ వేదికగా కూడా భారీ సభ నిర్వహించిన విషయం తెలిసిందే. ఎట్టి పరిస్థితుల్లోనూ రిజర్వేషన్లు అమలు చేసి తీరుతామని సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీ వేదికగా ప్రకటించారు. బీసీలను దగ్గర చేసుకునే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ బీసీ రిజర్వేషన్ల అంశాన్ని మరింతగా ఆ వర్గాల్లోకి తీసుకువెళ్లేందుకు బహిరంగ సభను ఏర్పాటు చేస్తోంది. సభకు ఏఐసీసీ అగ్రనేతలు రాహుల్ లేదా ప్రియాంక గాంధీని తీసుకురావాలని ప్రయత్నిస్తున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్‌తోపాటు రాష్ట్రంలోని కాంగ్రెస్ నాయకత్వమంతా సభకు హాజరుకానున్నారు.



హైదరాబాద్‌లో సమావేశమైన మహేశ్ గౌడ్, పొంగులేటి, సీతక్క, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్

నేడు కామారెడ్డిలో సన్నాహక సమావేశం

బీసీ రిజర్వేషన్ల సంబరాల సభకు సంబంధించి ఉమ్మడి జిల్లా నేతలతో ఆదివారం కామారెడ్డిలో సమావేశం నిర్వహించనున్నారు. సమావేశానికి పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్‌తోపాటు ఉమ్మడి జిల్లాకు చెందిన ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఇతర నేతలంతా హాజరుకానున్నారు. సభ సక్సెస్ కోసం తీసుకోవాల్సిన చర్యల గురించి సమావేశంలో చర్చించనున్నారు. సభ ఏర్పాట్లు, జనసమీకరణపై చర్చించి ఎవరు ఏ పని చేయాలన్నదానిపై దిశానిర్దేశం చేస్తారు.

తప్పని యూరియా కష్టాలు

- బారులు తీరుతున్న రైతులు
- టోకెన్లు పంపిణీ చేస్తున్న అధికారులు

రామారెడ్డి: రైతుల పరిస్థితి దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించలేదన్న చందంగా మారింది. యూరియా కొరత రైతులకు నిద్ర లేకుండా చేస్తోంది. యూరియా స్టాక్ వస్తుందనే తెలియగానే పంపిణీ కేంద్రాల వద్ద రైతులు పడిగాపులు కాస్తున్నారు. రాత్రి వేళ సైతం అక్కడే పడుకుంటున్న రైతులకు ఓ టోకెన్ ఇచ్చి రెండు లారీల లోడ్లు వచ్చిన తర్వాత పంపిణీ చేస్తామని చెప్పి పంపుతున్నారు. శనివారం రామారెడ్డి సొసైటీ భవనం వద్ద యూరియా పంపిణీ చేశారు. ఉదయం నుంచి రైతులు యూరియా కోసం బారులు తీరారు. 880 బస్తాలను పంపిణీ చేసినట్లుగా అధికారులు చెబుతున్నారు.

టోకెన్లను అమ్ముకుంటున్నారు

పట్టా పాస్‌పుస్తకం జిరాక్స్, ఆధార్ కార్డు జిరాక్స్ చూపిస్తే ఓ టోకెన్ ఇస్తున్నారు. ఒక్క టోకెన్‌కు ఒక బస్తా యూరియా ఇస్తున్నారు. కొంతమంది తమకు అవసరం లేకున్నా క్యూ లైన్‌లో నిల్చుని టోకెన్‌లు పొంది రూ.100 ఒకటి చొప్పున టోకెన్‌ను రైతులకు అమ్ముకుంటున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో రూ.100 పెట్టడానికి కూడా రైతులు వెనక్కి రావడం లేదు. దీంతో క్యూలైన్లలో దళారుల దందా యథేచ్ఛగా సాగుతోంది.



పంపిణీ కేంద్రం వద్ద తోపులాట



రామారెడ్డిలో యూరియా కోసం బారులు తీరిన రైతులు

క్లుప్తంగా

మంత్రి సీతక్కకు సన్మానం



కామారెడ్డి టౌన్: పంచాయతీరాజ్, శిశుసంక్షేమ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి అనసూయ(సీతక్క)ను జిల్లా కాంగ్రెస్, లంబాడా హక్కుల పోరాట సమితి నాయకులు శనివారం ఘనంగా సన్మానించారు. హైదరాబాద్ నుంచి సీతక్క నాగ్‌పూర్‌కు వెళ్తుండగా మార్గమధ్యలో టేక్రియాల్ బైపాస్ వద్ద మంత్రికి స్వాగతం పలికారు. పుష్పగుచ్చం అందజేసి శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రాణా ప్రతాప్ రాథోడ్, జిల్లా అధ్యక్షులు గణేష్ నాయక్, జిల్లా క్రమశిక్షణ కమిటీ కన్వీనర్ నాసిలాల్ నాయక్, నాయకులు శంకర్ నాయక్, విజయ్ నాయక్, రవిందర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దఎడ్గి లడ్డూ @ రూ.1.51 లక్షలు



నిజాంసాగర్(జుక్కల్)/సదాశివనగర్: జుక్కల్ మండలం పెద్దఎడ్గి గ్రామంలో ముదిరాజ్ గణేశ్ మండపం వద్ద వినాయక లడ్డూవేలం పాట శనివారం నిర్వహించారు. రూ.1.51 లక్షలకు లడ్డూను గ్రామానికి చెందిన సుంకరి అశోక్ దక్కించుకున్నారు. అశోక్ ను సన్మానించారు. సదాశివనగర్ మండలం కుప్రియాల్‌లో శివాజీ యువసేన యూత్ క్లబ్ గణేశ్ లడ్డూను వేలం పాట నిర్వహించగా రూ. 63వేలు పలికిట్లు యూత్ సభ్యులు పేర్కొన్నారు.

నేడు సంపూర్ణ చంద్రగ్రహణం

- ఆలయాల మూసివేత

కామారెడ్డి అర్బన్/నస్రుల్లాబాద్/భిక్కనూర్: చంద్రగ్రహణం కారణంగా ఆదివారం ఉదయం నుంచి ఆలయాలను మూసివేయనున్నట్లు కమిటీల ప్రతినిధులు తెలిపారు. సంప్రోక్షణ, దేవతామూర్తులకు అభిషేకం అనంతరం సోమవారం ఉదయం నుంచి భక్తులకు దర్శనం ఉంటుందని తెలిపారు. నస్రుల్లాబాద్ మండలం నెమ్లి గ్రామంలోని షిర్డీ సాయి ఆలయాన్ని మధ్యాహ్నం 12.30 గంటలకు మూసివేస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. దక్షిణ కాశీగా పేరొందిన భిక్కనూరు సిద్ధరామేశ్వరాలయాన్ని మధ్యాహ్నం ఒంటి గంటకు మూసి వేయనున్నట్లు అర్చకుడు రామగిరిశర్మ తెలిపారు. సోమవారం తెల్లవారుజామున సంప్రోక్షణ అనంతరం భక్తులకు దర్శనం కల్పిస్తామన్నారు. గ్రహణం నేపథ్యంలో ఆదివారం సాయంత్రం ఆరు గంటల వరకు భోజనాలు పూర్తి చేసుకోవాలని శర్మ సూచించారు.

గుర్తుతెలియని వ్యక్తి హత్య

ఖలీల్‌వాడి: నగరంలోని రైల్వే స్టేషన్ ఎదురుగా ఉన్న ఓ కిరాణా దుకాణం ముందర ఒక గుర్తుతెలియని వ్యక్తి హత్యకు గురైనట్లు వన్ టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపారు. సదరు కిరాణ దుకాణం వద్ద మృతదేహం పడి ఉండటంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు.వెంటనే ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేవని, అతడి వయస్సు సుమారు 50 నుంచి 55 ఏళ్ల మధ్య ఉంటాయని పోలీసులు పేర్కొన్నారు. గుర్తుతెలియని వ్యక్తులు మృతుడి మెడకు బట్ట, సుతిలితో ఉరి బిగించి ఊపిరి ఆడకుండా చేసి చంపినట్టు కనపడుతోందన్నారు. మృతుడు బ్లాక్ కలర్ ఫుల్ షర్ట్, గ్రే కలర్ ప్యాంటు ధరించి ఉన్నాడని, అతని వద్ద ముస్లింలు ధరించే టోపీ ఉందన్నారు. ఘటనపై భగవాన్‌కాలనీకి చెందిన వెనిశెట్టి శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడి సమాచారం తెలిస్తే వన్ టౌన్ పోలీస్ స్టేషన్ ఫోన్ నంబర్ 8712659714కు సమాచారం అందించాలన్నారు.



బాన్సువాడలో కోలాటం ఆడుతున్న పోచారం, కాసుల బాల్‌రాజ్



జంగంపల్లిలో శోభాయాత్రలో పాల్గొన్న మహిళలు

వినాయకా.. వీడ్కోలిక

సాక్షి, నెట్‌వర్క్ : నవరాత్రులు ఘనమైన పూజలందుకున్న వినాయకుడి శోభాయత్ర జిల్లాలోని పలు చోట్ల కనులపండువగా జరిగింది. గణపయ్యలకు శనివారం భక్తులు ఘనంగా వీడ్కోలు పలికారు. యువకుల డ్యాన్స్‌లు, మహిళ కోలాట నృత్యాలతో శోభాయాత్ర ఘనంగా జరిగింది. గణనాథులను స్థానిక చెరువుల్లో నిమజ్జనం చేశారు.



బిచ్కుందలో శోభాయాత్రలో భజన చేస్తున్న వార్కరీలు



దేవాయిపల్లిలో పూజలు చేస్తున్న చిన్నారులు



బిచ్కుందలో ..



రామారెడ్డిలో ..



బీబీపేటలో..



భిక్కనూరులో..



లింగంపేటలో తరలుతున్న గణనాథులు



శోభాయాత్రలో నృత్యం చేస్తున్న చిన్నారులు



నాగిరెడ్డిపేటలో నిమజ్జనం చేసిన వినాయక విగ్రహం



రామారెడ్డిలో క్రేన్ సాయంతో ..



కుప్రియాల్‌లో గణేశ్ శోభాయాత్రలో పాల్గొన్న శివాజీ యువసేన యూత్ సభ్యులు



బాన్సువాడ శోభాయాత్రలో పాల్గొన్న మహిళలు



కామారెడ్డిలో పెద్దబజార్ భక్తబాలుర సంఘం ఆధ్వర్యంలో పులిహోర పంపిణీ చేస్తున్న మహిళలు



మద్నూర్‌లో ఎడ్ల బండిపై తరలుతున్న మట్టి సార్వజనిక్ వినాయకుడు



బాన్సువాడలో తరలుతున్న వినాయకులు



రాజంపేటలో...



డీజే చప్పళ్లకు యువకుల డ్యాన్సులు



మద్నూర్‌లో ..



కామారెడ్డిలో.. తరలిస్తున్న చిన్నారులు



కామారెడ్డిలో తరలుతున్న భారీ వినాయకుడు



కామారెడ్డిలో శోభాయాత్రను తిలకించడానికి వచ్చిన జనాలు



చిన్నమల్లారెడ్డిలో...



సదాశివనగర్‌లో...



దోమకొండలోని మార్కండేయ మందిరం వద్ద..



దోమకొండలోని శివరామమందిర్ ఆలయం వద్ద..



దోమకొండలోని కపిల్ గణపతి శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

గణేశ్ నిమజ్జనానికి భారీ బందోబస్తు

- బాన్సువాడ డీఎస్పీ విఠల్‌రెడ్డి



సిబ్బందికి సూచనలు ఇస్తున్న డీఎస్పీ విఠల్‌రెడ్డి

బాన్సువాడ : బాన్సువాడలో శనివారం రాత్రి ప్రారంభమయ్యే గణేశ్ నిమజ్జనానికి భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు బాన్సువాడ డీఎస్పీ విఠల్‌రెడ్డి అన్నారు. శనివారం బాన్సువాడ పోలీస్ స్టేషన్‌లో పోలీసు సిబ్బందికి విధులు కేటాయించారు. నిమజ్జనం సమయంలో వ్యవహరించాల్సిన తీరుపై వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు బాన్సువాడ డివిజన్‌లో గత ఏడాది 1025 వినాయక మండపాలు ఉంటే ఈ ఏడాది 1382 మండపాలను ఏర్పాటు చేశారని అన్నారు. బాన్సువాడలో పాత బాన్సువాడ, కొత్త బాన్సువాడలో ఒకే రోజు శోభాయాత్ర ప్రారంభం కానున్న నేపథ్యంలో తన పర్యవేక్షణలో ఇద్దరు సీఐలు, ఆరుగురు ఎస్సైలు, 60 సిబ్బందికి విధులు కేటాయించామని అన్నారు. వినాయక నిమజ్జనం ప్రశాంత వాతవారణంలో కొనసాగేలా అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బాన్సువాడ, బిచ్కుంద సీఐలు అశోక్, అనిల్‌కుమార్‌లు ఉన్నారు.

గణేశ్ నిమజ్జన శోభాయాత్ర రూట్ల పరిశీలన



ఎల్లారెడ్డిలో శోభాయాత్ర రూట్లను పరిశీలిస్తున్న అధికారులు

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డిలో గణేశ్ నిమజ్జన శోభాయాత్ర రూట్లను శనివారం అధికారులు పరిశీలించారు. పట్టణంలోని డెయిలీమార్కెట్, గాంధీచౌక్, పెద్దమసీదు ప్రాంతాలలో గణేశ్ నిమజ్జన రూట్లను ఎస్సై మహేష్, విద్యుత్ శాఖ డీఈ విజయసారథిలు పరిశీలించారు. వినాయక విగ్రహాలకు విద్యుత్ తీగలు అడ్డుగా ఉన్న ప్రదేశాలలో నూతనంగా విద్యుత్ స్తంభాలను విద్యుత్ శాఖ అధికారులు ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మంజీర బ్రిడ్జికి వేలాడిన మృతదేహం

బోధన్‌రూరల్: మంజీర నది బ్రిడ్జికి శనివారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం వేలాడుతూ కనిపించడంతో కలకలం రేపింది. అటువైపుగా వెళ్లిన కొందరు ప్రయాణికులు మృతదేహాన్ని గమనించి బోధన్ రూరల్ పోలీసులు సమాచారం అందించారు. వెంటనే వారు ఘటన స్థలానికి చేరుకొని, పరిసరాలను పరిశీలించారు. ఘటన స్థలం మహారాష్ట్ర పరిధిలోకి రావడంతో మహారాష్ట్ర పోలీసులకు సమాచారం అందించారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

- మరో ఇద్దరికి గాయాలు



అభినాష్ మృతదేహం

బాల్కొండ: మెండోరా మండలం పోచంపాడ్ చౌరస్తాలోగల 44వ జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందాడు. మెండోరా ఎస్సై జాదవ్ సుహాసిని తెలిపిన వివరాలు ఇలా.. నిర్మల్ జిల్లా సోన్ మండలం గాంధీనగర్‌కు చెందిన సాస్కిన్ అభినాష్(25) శుక్రవారం మధ్యాహ్నం బైక్‌పై తన బంధువుల పిల్లలైన రుసునకంటే గణేష్, అంబ్లే లోకేష్‌లతో కలిసి శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ దిగువన గోదావరిలో చేపలు వేటాడడానికి వచ్చారు. వేట ముగిసిన తర్వాత అర్ధరాత్రి వేళ బైక్‌పై ఇంటికి బయలుదేరారు. పోచంపాడ్ చౌరస్తాలోగల హైవేపై వీరి బైక్‌ను ఆర్మూర్ నుంచి నిర్మల్ వైపు వెళ్తున్న గుర్తుతెలియని వాహనం వెనుక నుంచి వేగంగా ఢీకొట్టడంతో ముగ్గురు కిందపడ్డారు. ఈ ఘటనలో బైక్‌పై మధ్యలో కుర్చున్న అభినాష్ తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ఇద్దరికి గాయాలు కాగా నిర్మల్‌జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

స్వగ్రామం చేరిన అన్వేష్‌రెడ్డి మృతదేహం



అన్వేష్‌రెడ్డి మృతదేహం

బాల్కొండ: మెండోరా మండల కేంద్రానికి చెందిన సామ అన్వేష్‌రెడ్డి(30) పది రోజుల క్రితం గుండెపోటుతో ఐర్లాండ్‌లో మృతి చెందాడు. ఆయన మృతదేహం శనివారం ఉదయం స్వగ్రామానికి చేరుకుంది. కుటుంబసభ్యుల రోదనలు మధ్యే అంత్యక్రియలను నిర్వహించారు. అన్వేష్‌రెడ్డి నాలుగు నెలల క్రితమే సెలవుపై వచ్చి వివాహం చేసుకుని ఇటీవల వెళ్లాడు.

గ్రామాల్లో వైద్య శిబిరాలు



పెద్దమల్లారెడ్డిలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



ఎల్లాపూర్ తండాలో ..



సదాశివనగర్ మోడల్ స్కూల్‌లో..

భిక్కనూరు/సదాశివనగర్/బాన్సువాడ రూరల్/రాజంపేట : జిల్లాలోని పలు చోట్ల వైద్యశిబిరాలు నిర్వహించారు. భిక్కనూరు మండలకేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో భిక్కనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్య శిబిరాలను శనివారం నిర్వహించారు. వైద్యురాలు యెమిమా, ఎంపీహెచ్‌ఈవో వెంకటరమణ పరీక్షలు నిర్వహించారు. సదాశివనగర్ మోడల్ స్కూల్ వసతి గృహంలో నిర్వహించిన వైద్యశిబిరంలో వైద్యాధికారిణి ఆస్మా అఫ్షిన్ సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు.బాన్సువాడ మండలం బోర్లంక్యాంపులో గల తెలంగాణ సాంఘీక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో నిర్వహించిన ఆరోగ్య శిబిరంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఇమ్రాన్ వైద్య సిబ్బందితో కలిసి విద్యార్థులను పరీక్షించారు. చాలామంది విద్యార్థులు జ్వరాల బారిన పడటంతో రక్తపరీక్షలు చేశారు. హన్మాజీపేట్ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో విద్యార్థులకు కావాల్సిన మందులు అందజేశారు. కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆహ్వానం మేరకు రాజంపేట మండలం నడిమి తండా, ఎల్లాపూర్ తండాల్లో రామకృష్ణ మఠం ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్యశిబిరంలో 293 మంది వైద్యపరీక్షలు చేశారు. వైద్య శిబిరాల్లో వారికి కావాల్సిన మందులు అందజేశారు.రామకృష్ణ మఠం వైద్యులు శుషిృత్, కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రి వైద్యురాలు తేజస్వినీ, రామకృష్ణ మఠం సభ్యులు ఉన్నారు.



బోర్లంక్యాంపులో విద్యార్థులను పరీక్షిస్తున్న వైద్యులు

ఆలయంలో చోరీ

మాక్లూర్: మండలంలోని అమ్రాద్ తండాలోని వీర హనుమాన్ ఆలయంలో శుక్రవారం రాత్రి గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడినట్లు తండావాసులు తెలిపారు. ఆలయం తాళాలను పగులగొట్టి, బీరువాలో అరకిలో వెండి కిరీటంతోపాటు చేతిలో ఉన్న గధను అపహరించారు. ఆలయంలో పసుపు, కుంకుమ కలిపి వండిన అన్నం పారబోశారు. ఈ ఘటనపై ఆలయ చైర్మన్ మూడ గోవింద్‌నాయక్ పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

ట్రాక్టర్‌ను ఢీకొన్న లారీ

- నలుగురికి తీవ్ర గాయాలు

కామారెడ్డి క్రైం: గణేష్ శోభాయాత్ర కోసం తీసుకువెళ్తున్న ట్రాక్టర్ ట్రాలీని లారీ ఢీకొన్న ఘటనలో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన కామారెడ్డికి సమీపంలోని క్యాసంపల్లి వద్ద ప్రధా న రోడ్డుపై శనివారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా.. రామారెడ్డి నుంచి ట్రాక్టర్ ట్రాలీని కొంద రు యువకులు కలిసి దోమకొండకు తీసుకువెళ్తున్నారు. ఈ సమయంలో నలుగురు యువకులు ట్రాక్టర్ ఇంజిన్‌పై కూర్చుని ప్రయాణిస్తున్నారు. క్యాసంపల్లి వద్ద వారి ట్రాక్టర్‌ను ఓ లారీ వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో దోమకొండ కు చెందిన సాయికుమార్, శ్రీధర్, రాజయ్య, శివకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసు లు వారిని కామారెడ్డి ఆస్పత్రికి తరలించారు. గా యపడిన వారిలో శ్రీధర్ పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌కు తరలించారు.



ఆస్పత్రిలో బాధితుడు